కథానిక ◆ అవసరాల రామకృష్ణారావు

# నన్ను నేనే వదులుకోనా!



**మానవ సంబంధాల్ని దెబ్బతీసే స్థాయికి చేరుకున్నప్పుడు కులమైనా, మతమైనా, మరేదైనా తప్పకుండా ప్రశ్నార్థకమవుతుంది**

ప్రత్యేకించి ఈశాన్య మూలగా కట్టించిన ఆ దైవపీఠం ముందు దిగాలుపడి కూచున్నాను. ఇంటిల్లిపాదీ ఒకరి తర్వాత మరొకరు వచ్చి బతిమాలినా అక్కణ్నుంచి కదలలేకపోయాను. చేజేతులా చేసిన ప్రయత్నం ఇంతగా నీరుకారి పోతుందని కలలో కూడా అనుకోలేదు. మారు రూపు దిద్దుకున్న ఆ గదిని తేరిపార చూసినకొద్దీ ఇంకా పిచ్చెత్తిపోతుందేమో అనిపించింది. దాని తలుపు దగ్గరగా వేసి, గొళ్ళెం పెట్టి, ఇవతలి వరండాలోకి వచ్చాను. అక్కడి టేబిల్ మీద ఉన్న ఇంగ్లీషు దిన పత్రికల కట్టమీద పడింది నా దృష్టి. అంతటి దైన్యావస్థలోనూ వెర్రి నవ్వొకటి వచ్చింది నాకు. తాళ పత్రాలతో మొదలెట్టి కాగితాల దాకా ఎకబాకింది మన జ్ఞానం. ఇదింకా సూక్ష్మమై, సులభమై, మైక్రోఫిల్మ్‌లో నిక్షిప్తమవడానికి ఎంతో దూరం లేదు. శాస్త్ర ప్రగతి ఎంత ముందడుగు వేస్తోందో, మనిషి మూఢమతి అంత వేగంగానూ వెనకడుగు వేస్తోంది. సంస్కారం అనేది గుండెల్లోంచి తన్నుకు రావాలిగాని మరే ఇతర ప్రక్రియకు దోహదం చెయ్యలేదు కాబోలు.

అలా ఆ పేపర్లు చూస్తుంటే ఓసారి ఇబ్రహీం అన్నమాట గుర్తొచ్చింది: ప్రతీవారం కొన్ని వేల పేర్లు 'మేట్రిమోనియల్ కాలమ్'లో పడతాయి. పెళ్ళికాని కొందర్ని దీన్లో వేయించుకోమనీ, చాయిస్ బాగా ఉంటుందనీ చెప్పి చూశాను. వాళ్ళేమన్నారో తెలుసా? మరెక్కడా చలామణీ కానివారూ, ఏదో పైకి చెప్పుకోలేని లోపం ఉన్నవారూ, నడతలో ఏదో తేడా ఉన్నవారూ... ఇలాంటివాళ్ళే కల్యాణ వేదికల్లో కనబడతారట. ఇంతకన్నా అభాండం ఉందా? మనం కోరుకున్న యోగ్యతలు గల వధూవరుల కోసం అచ్చురూపాన అడగడం అదీ ఓరకం ప్రగతే కదా!... అంటే అతను చెప్పిన జవాబు మరొకటి. ఆ పేజీలు రెండూ తిప్పి నా మొహాన పడేసి అన్నాడు... దీనికి నేనేం వ్యతిరేకిననుకోకు. కానీ, ఇలాంటి ప్రగతికి ఎన్ని మార్కులు వెయ్యగలవో నువ్వే ఆ ప్రకటనలన్నీ ఓసారి పూర్తిగా పరిశీలించి చెప్పు. కులం మాత్రం, మతం మాత్రమే కాదు, శాఖ కూడా వదిలి పెట్టరు. ఇలాంటి వాటి ప్రసక్తి లేదని చెప్పినవాళ్ళూ నూటికో కోటికో ఉంటారు. ఆరోగ్యం మాట ఏమిటి, సంబంధీకులలో సంక్రమణ వ్యాధులు లేవు కదా, బ్లడ్ గ్రూప్ ఏమిటి? వీటి సంగతి మాటవరసకైనా అడక్కుండా జాతకాలు పట్టుకుపాకులాడాతారు. అన్నిటికంటే జోకు ఏమిటంటే, ప్రకటన వేయించుకున్నవారికి కంప్యూటర్ జాతకం ఉచితం!

"అమ్మీ ఎంతసేపు అలా కూచుంటావ్, ఇదిగో నీకిష్టమైన గజల్ పెడుతున్నాను విను" అంటూ మా అమ్మాయి టేప్‌రికార్డరు ఆన్ చేసింది. ఘజల్ ఉన్నీసా దాన్ని కట్టేసేదాకా నేను ఊరుకోలేదు. నిస్సహాయతతో మళ్ళీ పక్కగది గొళ్ళెం తీసి లోపలి కొచ్చి ఈసారి ఇట్నించి తలుపేసుకుని పడక్కుర్చీలో కూలబడ్డాను. ఎక్కడెక్కడికి పోయిందో ఆ ప్రాణం.

మొదట్నుంచీ హిందుస్తానీ సంగీతం అంటే నాకు ఇష్టం. అందునా గజల్స్ అంటే ప్రాణం. 'గలగల పారే గంగానదిలో మిలమిల మెరసే చుక్కల కన్నులు...' ఇలాంటి తెలుగర్థం వచ్చే చక్కని ఉర్దూ గజల్ ఒకటి ఎన్నిసార్లు విన్నా, పాడుకున్నా నాకు తనివి తీరేది కాదు. మా వాళ్ళు నన్ను బలవంతాన కట్టబెట్టిన పల్లెటూరి గంగిరెద్దు మాత్రం 'ముఖ సౌందర్యం దేనికనే' అనుకునే రకం! ఇంకా అతగాడు నయమే. ఆ చుట్టూ ఉన్న మందీ మార్బలమూ పెట్టిన హింస మాత్రం మరచి పోలేను. అయితే ఇప్పుడనిపిస్తుంది. ఇంతగా అణచి పెట్టేరు గనకనే నాలోని వ్యక్తిత్వం ఇప్పుడింతగా తిరగబడింది. అతగాడు పోయిన రెండో ఏడు చివరన మా అత్తారింటి నుంచి బయట పడినప్పుడే ఆ పోరాట పటిమ మొగ్గ తొడిగింది. పగలంతా చాకిరీ, నౌకరీ. రాత్రిపూట సవారీకి తయారీ. ఇంతేనా ఈ నారీ హిస్టరీ? - అనే ప్రశ్న పదేపదే నన్ను బాధించి, నాదనే వ్యక్తిత్వం నిలుపుకునే బాటలో నడిపించింది. అందుకనే ఆ యాభై ఎకరాల ఆస్తీ వాళ్ళ మొహాన దిగదుడిచి రాసిచ్చి అత్తారింటికి గుడ్‌బై కొట్టేశాను. అలాగని మా అన్నయ్య పంచన నీడ కోరేనా? ఉహూఁ పుట్టింటికి చేరలేదు. హసీనా అని మా క్లాస్‌మేట్ ఒకర్తుంది. 'మనం మనుషుల్లా బతకాలి' అంటూ మొదట్నుంచీ నాకు మంత్రోప దేశం చేసింది అదే. మెళ్ళో ఓ గొలుసూ, చేతికి రెండు బంగారు గాజులూ, నాలుగు జతల బట్టలతో ఓ సూట్‌కేసూ- వీటితో దాని ఇంటికి చేరాను.

ఇక్కడ హసీనా కథ కొంత చెప్పడం అవసరం. తెలంగాణాలోని ఓ కుగ్రామంలో ఓ సనాతన ముస్లిం వంశానికి చెందినది అది. ఆ బురఖా సంస్కృతిని భరించలేక కట్టుబాట్లు ఛేదించుకుని ఎలాగో మా ఊరు వచ్చి ఓ దూరపు చుట్టం సహాయంతో స్కూల్లో చేరింది. చుట్టమే దెయ్యమై కరవబోతే, ఓ టైలరుతో నిఖా చేసుకుని నేను చేరిన ఊళ్ళో కాపరం ఉంటోంది. దాన్ని చేరదీసిన అబ్దుల్ చాలా మంచివాడు. ఇద్దరూ నన్నెంతో ఆదరించేవారు. ఎంత చెప్పినా వినకుండా హసీనా నాకోసం మళ్ళీ అన్ని గిన్నెలూ కడిగి వేరే వంట చేసి పెట్టేది. నాకెలా హిందుస్థానీ ట్యూన్స్ ఇష్టమో హసీనాకు తెలుగు జోలపాటలు అంటే పంచ ప్రాణాలూను. మొదట్నుంచీ దానికి చదువు మీద ఇష్టం ఉండేది కాదు. అయితే ఏమైంది? బట్టలు కత్తిరించీ, గుండీలు కుట్టీ అబ్దుల్‌కి ఎంతో సాయం చేసేది. నాకు మాత్రం ఎంత ట్రై చేసినా అవేవీ వచ్చేవికావు. ఎంతసేపూ ట్యూషన్ పిల్లల్ని పెట్టుకు కూచునేదాన్ని. పైగా ఏకంగా బియ్యేకే కట్టేను గనక రాత్రింబవళ్ళు ఆ ధ్యాసలోనే ఉండేదాన్ని. చెప్పడం మరిచానేమో. అప్పటికే ప్రైవేట్ కంపెనీలో జూనియర్ ఎకౌంటెంట్‌గా పనిచేసేదాన్ని.

ఎలా గడిచిపోయాయో ఆ రెండేళ్ళూ. ఉన్నట్టుండి ఓ సాయంకాలం మా అన్నయ్య ఇద్దరు మనుషుల్ని తీసుకుని -మరి నా అడ్రసు ఎలా పట్టుకున్నాడో - వచ్చి పడ్డాడు. కూచోబెట్టి కాఫీ ఇచ్చి 'ఏం రా బావున్నావా?' అనడిగితే లేచి నిలబడి "ఇదేమైనా బాగుందా? అదీ ముందు చెప్పు" అంటూ ఆరంభించాడు. ఉన్నట్టుండి అన్నయ్యకింత శ్రద్ధ ఎందుకు పుట్టుకు వచ్చిందో తర్వాత తెలిసింది. నేనే సంతకం చేసి అంత ఆస్తీ ఇచ్చేసినా బలవంతాన అది మా బావగార్లూ వాళ్ళూ నాచేత చేయించారనీ, చెల్లదనీ దావా వెయ్యొచ్చనీ, ఎవడో తెలిసిన ప్లీడరు జ్ఞానోపదేశం చేశాడట. అవన్నీ తొక్కిపెట్టి "ముండమోసింది చాలక (అదేదో స్వయంగా చేయగల ఘనకార్యమని తెలిస్తే ముందే ఆ పని చేసి ఉండనా?) సాయిబుల అండచేరి, వర్ణ సంకరం చేస్తావటే? రేపొద్దున నా ముగ్గురాడపిల్లలకీ ఏమొహం పెట్టుకు పెళ్ళిళ్ళు చెయ్యనే? నువ్వు చేసిన భ్రష్టు పనికి నీ తల్లి ఇంకా ఎందుకు బతికున్నానని ఏడుస్తోంది గదటే"



చిత్రాలు: నర్సిం

అంటూ తగులుకున్నాడు. చల్లారిన కాఫీ అవతల పారబోసి లేచి నిలబడమని సంజ్ఞ చేశాను. "ఒరే నేనిప్పుడు పూర్వపు లలితమ్మని కాను. నువ్వెరగని మేజరమ్మని. నా ఇష్టం వచ్చినట్టు బతకడానికి నాకు సర్వహక్కులూ ఉన్నాయి. మా అత్తారి పాపిష్టి ఆస్తి ఏనాడో వాళ్ళకు ధారాదత్తం చేశాను. నా తరఫున ఏవైనా వెర్రి ప్రయత్నాలు చేశావో నీకేం దక్కడు సరికదా నాన్నగారి స్వార్జితంలో నా వాటా కోసం కోర్టుకెళ్ళగలను." ఇలా ఏదో నేను చెప్పబోతుండగా నలుగుర్నీ పోగు చేసి నానా అల్లరీ మొదలెట్టాడు. కూడా వచ్చిన కిరాయిగాళ్ళు రెచ్చిపోబోయారు. సమయానికి అబ్దుల్, హసీనా పిల్లని తీసుకుని ఏదో ఉర్సులో పాల్గొనడానికి హైదరాబాదు వెళ్ళారు. ఎంతైనా ఒంటరి ఆడదాన్ని, ఏం అల్లరి జరిగిపోనో, సమయానికి ఇబ్రహీం వచ్చి ఆదుకున్నాడు దౌర్భాగ్యుల బారి నుంచి. మరి ఏం సమాధాన పరచి పంపించాడో, నన్ను సేవ్ చేశాడు.

ఇబ్రహీం నేను పని చేస్తున్న ఆఫీసులో ఓ డైరెక్టర్. ఓ ఫంక్షన్‌లో నేను పాడిన గజల్‌ని ఎంతో మెచ్చుకున్నాడు. అబ్దుల్ ఇంటికొచ్చి అప్పుడప్పుడు పాటా, దాంతో పాటు మాటా కలిపేవాడు. అలా మా పరిచయం సాన్నిహిత్యంగా మారింది.

వాళ్ళని వెళ్ళిపోనిచ్చి, నాచేత మరో పాట పాడించి, వాతావరణం ఆహ్లాదంగా మార్చాడు. లోపలికొచ్చి మంచం మీద కూచున్నాడు. మరి లేవనన్నట్టు కనిపించాడు.

"మిమ్మల్నోమాట అడగదల్చుకున్నాను. ఏమీ అనుకోనంటే" అన్నాడు.

"నన్ను నువ్వని పిలిస్తే నేనేం అనుకోను."

"మావాళ్ళందరూ నన్ను 'ఇబ్బూ' అని పిలుస్తారు. అలాగే పిలిస్తే నాకిష్టం."

"నాకూ 'లల్లీ' అని పిలిస్తే బాగుంటుంది."

"అలాగే లల్లీ!"

"సరే ఇబ్బూ!"

ఇద్దరం నవ్వుకున్నాం. అంత చనువు తీసుకున్నాక ఏకాంతంలో ఉన్న ఆడామగా తీసుకునే చనువు తీసుకోకుండా ఉండలేకపోయాం. దొరికిన మొదటి అవకాశంతోనే రిజిష్టర్డు మ్యారేజ్ చేసుకుని ఆలూమగలమయ్యాం. ఏడాది దాటకుండా జాబ్‌లో ఇంక్రిమెంటే కాక, తల్లిగా ప్రమోషన్ కూడా లభించింది నాకు.

ఇబ్రహీం ఫామిలీ మెంబర్సంతా చాలావరకు మైసూర్‌లో ఏదో పెద్ద పెద్ద ఉద్యోగాల్లోనే ఉన్నారుట. మనకు ఆ కులమేదో మతమేదో తెలీకపోయినా బాగా డబ్బున్నవాళ్ళందరికీ ఆ మాత్రం సంస్కారం ఉండదా అనుకుంటాం. అదేం కాదని తొందర్లోనే తేలింది. వాళ్ళవాళ్ళంతా ఇబ్రహీంని బాయ్‌కాట్ చేశారు. నన్ను పెళ్ళిచేసుకున్నందుకు. వాళ్ళమ్మగారు మాత్రం ఇప్పుడు మాతోనే ఉంటోంది. లక్షల్లో ఎన్నదగ్గ మనిషి. ఎంత చల్లగా పూలజల్లులా ఉండేదో. వాళ్ళ ఆచారాలూ, మతధర్మాలూ హసీనాతో ఏళ్ళ తరబడి గడిపిన నాకు అంతో ఇంతో పరిచయమే. కానీ, నాతో ఇంతగా కలసిపోవడానికి ఇబ్బూ అమ్మీకి ఎంత పెద్దమనసు ఉండాలో!

ఏమైతేనేం, ఎన్ని ఒడుదుడుకులు పడితేనేం, నడి వయసులోనైనా నా వ్యక్తిత్వాన్ని గౌరవించే మగాడు దొరికాడు. నన్ను ఆదరించే అత్తగారూ దొరికింది. నేను ప్రేమించి పెంచే కూతురు 'ఫజల్' పుట్టింది.

'ఇంతకన్నా ఇంకేం కావాలి' అనుకుంటున్న సమయంలో మా అమ్మ కబురు నన్ను కలవరపెట్టి, మనశ్శాంతి లేకుండా చేసింది.

ఏ ఆడదీ అమ్మని తలుచుకోనంత స్వార్థ స్థాయిని చేరుకుని ఉండదు. కానీ, అన్నలాంటి డబ్బు మనిషి పంచన అమ్మని వదిలేశానంటే ఆ విషయంలో నేను చేసేది ఏమీ లేకపోవడమే కారణం. మొదట్నుంచీ అమ్మ అతి ఛాందసరకం. మడీ, ముట్టూ, మైలా అనే మకార త్రయంలోనే మహిళాజీవన పరమార్థం, సాఫల్యం ఉందనే మహత్తర జ్ఞానానికి మా అమ్మ కొలికపూస. ఆమెతో గడిపిన అన్నేళ్ళూ ఏదో చిన్న పొరపాటుకి తిట్లు తినని రోజంటూ ఉండేది కాదు. స్కూల్నుంచి ఇంటికి వచ్చాక తలారా స్నానం చేస్తేగాని లోపలికి రానిచ్చేది కాదు. దినం పొడుగునా ఏదో అపవిత్రం చేసి ఆచారం మంట గలుపుతున్నాననే అనుమానం. ఆ మెట్రిక్ మెట్టు చేరలేక ఎన్ని మొట్టికాయలు తిన్నానో ఈ ఆడబుర్రకే ఎరుక. 'ఈ పెద్ద కులంలో ఎందుకు పడేశావు దేవుడా' అని ఆ కనిపించని వాణ్ణి దులిపి దుళ్ళగొట్టని రోజుండేది కాదు నాకు. మా పల్లెటూరి అత్తారింటివాళ్ళూ పరమ దుర్మార్గులే కాని, ఇంత మూఢాచారపరులు మాత్రం కాదు. అలాంటిది విధవగా మారడమే గాక వాళ్ళ దృష్టిలో అంటరానివాళ్ళింట చేరి 'వెధవ పని' చేసిన నేను మా అమ్మని ఎలా తెచ్చుకోను. ఆమె ఆరోగ్యం గురించి ఎంత కొట్టుకున్నా, ఏ విధంగా మా ఇంటికి పిలిపించను. వెళ్ళి చూసొద్దామని ఎన్నోసార్లు ఆడమనను పీకినా, అన్నయ్య చేసిన బాగోతం గుర్తొచ్చి ఎలాగో అణచుకున్నాను.

చూస్తుండగా పదేళ్ళు అయిపోయింది అమ్మని చూసి. ఏ దురాలోచనలూ చొరబడకుండా, ఎంగేజ్డ్‌గా ఉండడం మనసుకి అలవాటు చేసుకున్నాను గాని, 'అమ్మ ఎలా ఉందో' అనే ఊహ ఏ సందునో తొంగి చూసి నన్ను ఇరుకున పెట్టేది.

'నీ స్వేచ్ఛకి ఏ మాత్రం అడ్డు రాని సహృదయుడైన భర్త, నీ మాట మన్నించే అత్తగారూ, కూతురూ. ఒకణ్ణి చెయ్యి చాచి పైసా అడగవలసిన అవసరం లేని ఆర్థిక పరిపుష్టి నీది. ఓసారి వెళ్ళి కన్నతల్లిని చూసి రావడానికి నీకేమిటే అడ్డు' అనే నా ప్రశ్నకి నేనే జవాబు చెప్పుకోలేకపోయేదాన్ని.

చూసి చేసేదేమిటి? ఫేమిలీ పెన్షన్ ఉండనే ఉంది. ఆ కాస్తా చాలదనుకుంటే పల్లెటూళ్ళో ఆమె పేర ఇంకా ఇల్లూ, పొలమూ ఉన్నాయి. అన్నయ్య అదంతా ఎప్పుడో తన పేర రాయించేసుకుని ఉన్నా, ఒంటి మీద యాభై తులాలకు తక్కువ కాకుండా బంగారం ఉండాలి. ఇవన్నీ ఎలా ఉన్నా కొడుకు చేత చచ్చేక కొరివి పెట్టించుకోవాలనే కోరికా ఉంది. ఆవిడ దృష్టిలో పూర్తిగా చెడిపోయిన నేను వెళ్ళి మరింత అల్లరి పెట్టడం, పడడం కాక కౌగున కట్టుకునేది ఏముటుంది?"

ఇలా ఏ జవాబూ ఎందుకో పూర్తి తృప్తిని ఇవ్వలేకపోయేది. ఇదిగో సరిగ్గా ఇలాంటప్పుడే సావిత్రత్త చేరేసిన అమ్మ కబుర్లు ఒకటీ ఒకటీ నన్ను నిలబడనివ్వకుండా చేశాయి.

సావిత్రత్త నా కంటే ఏ పదేళ్ళో పెద్ద అయి ఉంటుంది. మా అమ్మతో పాటు నన్నందరూ చచ్చిందాన్తో జమ చేసినా, అత్త మాత్రం నేనెక్కడున్నానో, ఏం చేస్తున్నానో అంతా ఫాలో అవుతూనే ఉంది. ఇబ్రహీంతో నా పెళ్ళికి పాసు మార్కులైనా వేసింది ఆవిడ ఒక్కతే. తక్కిన మార్కులైనా ఇష్టం లేక కాదు, మన మతమైనా కాని మనిషితో జీవితం లేనిపోని ఏ చిక్కులు తెచ్చిపెడుతుందో అని. ఫజల్‌ని స్కూల్లో వేసినప్పుడు పెద్ద వేడుకలా చేశాం. అప్పుడు మా అత్తని ఆహ్వానించాం. రహస్యంగా వచ్చి వెళ్ళింది. నన్ను చూసి, ముఖ్యంగా నన్ను నెత్తి మీద పెట్టుకు చూస్తున్న మనుషుల సత్ప్రవర్తన గమనించి, ఎంత పొంగిపోయిందో. "ఏమో అనుకున్నాను, ఎంత అదృష్టవంతురాలివే లలితా" అని ఆశీర్వదించి, నిండు మనసుతో చేతుల్నిండా మా కానుకలతో రైలెక్కింది. వెళ్ళగానే ఉత్తరం రాసింది క్షేమసమాచారం తెలుపుతూ. అఖర్న 'జవాబు మాత్రం రాయకు. ఎందుకంటే మనవాళ్ళంతా చాలావరకు పశువులు. మీవాళ్ళ లాంటి తప్పబుట్టిన మనుషులు అక్కడక్కడ ఉంటారు. అంతే' అనే వాక్యం ఎప్పుడూ మరచిపోలేను.

అలాంటి కరుణామయి ఈమధ్య మా అమ్మ గురించి నాకు చేర్చిన భోగట్టాలు మాత్రం ఇటు కక్కలేనివి, అటు మింగలేనివి.

"ఎంతో పోరాడి, ఎన్నో ధైర్యమైన నిర్ణయాలు తీసుకుని నీ జీవితం చక్కదిద్దుకున్న సాహసివి. ఆపదలో ఉన్న నీ కన్నతల్లిని ఆవిడ కర్మానికావిణ్ణి వదిలెయ్యకుండా ఏదో ఒకటి చేస్తావనే ఆశతో ఈ

"ఒరే నేనిప్పుడు పూర్వపు లలితమ్మని కాను. నువ్వెరగని మేజరమ్మని. నా ఇష్టం వచ్చినట్టు బతకడానికి నాకు సర్వహక్కులూ ఉన్నాయి."

ఉత్తరం రాస్తున్నాను. నీకు తోచిన ఏ మంచి పనికైనా చేయూత ఇచ్చే సౌజన్యమూర్తుల సమక్షంలో ఉన్నావు. అందుకే ఈ ధీమా. ఆలోచించి ఏదో ఓ నిర్ణయం వీలైనంత తొందర్లో తీసుకో.

వదిన గురించి అప్పుడప్పుడు వింటూ వచ్చాను గానీ మొన్నామధ్య స్వయంగా చూసొచ్చేదాకా నాకు తెలీలేదు.

మీ అన్నయ్యా, పిల్లలూ, వదినా, ఆవిడ పుట్టింటి నుంచి తెచ్చుకున్న దాసీపిల్లతో సహా మహా అన్యాయంగా చూస్తున్నారు. ఇంటెడు చాకిరీ మీ అమ్మదే. నడుం వంగిపోయి, ఆయాసం ఎగదన్ని, నేడో రేపో అన్న ఆ డెబ్బై ఏళ్ళ మనిషి చేత నానా సేవా చేయించుకోవడమే గాక ఏమాత్రం తేడా వచ్చినా తిట్టని తిట్టుగాని, మరీ ఈమధ్య మొట్టని మొట్టుగాని లేదని నాతో చెప్పుకు ఏడ్చింది. ఎంత రహస్యంగా చెప్పుకున్నా ఇలా లేనిపోనివి చెప్పి అపకీర్తి తెస్తున్నావని నా ఎదుటే మీ వదిన చీపురు తిరగేసింది. అక్కడే ఉన్న మీ అన్నయ్య మరో నాలుగు మాటలన్నాడు గాని పెళ్ళాన్ని వారించలేదు. మీ ఇల్లూ, పొలమూ మీ అమ్మ పేర ఉన్నాయిట కదా, అవి చేతిలో పడేదాకా ఓ మోస్తరుగానైనా చూసేవారట. ఇప్పుడు వాళ్ళ దృష్టి ఆమె పది పేటల పలకసర్ల మీద పడిందట. ఇంత పిల్లప్పుడు వాళ్ళమ్మ పెడితే ఈ అరవై ఏళ్ళూ శరీరంలో ఓ భాగంగా వదిన పెట్టుకుంది. ముసల్ది కదా ఎవరైనా లాక్కుపోతారేమోనని మీ అన్నయ్యా వాళ్ళే ఈమధ్య బలవంతాన ఊడలాక్కున్నారట. మెడంతా ఇంత పొడుగున గీరుకుపోయి పుండైపోయిందిట. చూపించి గొల్లుమంది.

ఈమధ్య గుప్పెడన్నం కూడా పెట్టడం లేదట. ముసిల్డి ఆర్చుకుపోయి ఉంది. ఎక్కడికైనా తగలెయ్యడానికి సిద్ధంగా ఉన్నారు. నాతో వచ్చేస్తానని కూర్చుంది. వాళ్ళూ అలాగే అన్నారు. కానీ, మాదెంత సమష్టి కుటుంబమో, మావాళ్ళెంత రాక్షసులో, నేనెంత నిస్సహాయురాలినో నువ్వెరుగుదువుకదా.

ఇన్ని జరిగినా మీ అమ్మ మూర్ఖత్వం ఏమాత్రం నడలిందని నేననుకోను. అంత హింసకి గురి చేసిన మీ అన్నయ్య కంటే ఆవిడ దృష్టిలో నువ్వు చేసిన నేరమే ఎక్కువ. అజ్ఞానమనేది మనిషిని ఎంత మూర్ఖులుగానైనా మారుస్తుంది. జ్ఞానం లేని తల్లులు చంటిపిల్లల కింద లెక్క. మీ అమ్మ ఇప్పుడు నీ రెండో కూతురు అనుకో. దిక్కు లేని చావు చచ్చేముందే వెళ్ళి మీ ఇంటికి తెచ్చుకో. నీ తల్లి రుణం తీర్చుకో. అయినా, ఇంకెన్నాళ్ళు బతుకుతుంది గనక!"

ఇక భరించలేక ఆ ఉత్తరాన్ని ఇబ్రహీంకీ, వాళ్ళమ్మకీ చూపించాను. ఫజల్ స్కూలుకి వెళ్ళిపోనిచ్చి మేం ముగ్గురం కూర్చుని దీన్నెలా పరిష్కరించాలో డిస్కస్ చేశాం. అమ్మని ఇక్కడికి తీసుకురావడానికి నిశ్చయించాం. అయితే, ఇందులో రెండు ఆటంకాలు. ఒకటి- నెలకి రెండొందలు ఫేమిలీ పెన్షన్ తెచ్చే, ఇంటిల్లిపాదికీ వండి పెట్టే మనిషిని అన్నయ్య వదులుకుంటాడా అని. కట్టె వంకర పొయ్యి తీరుస్తుందన్నట్టు అంతులేని ధనాశ గల అన్నయ్య లాంటివాడి మొహాన ఒక్కసారి ఏ పదివేలో కొడితే నిరభ్యంతరంగా ఒప్పుకుంటాడు. రెండోది- మూఢాచార పరాయణురాలైన అమ్మ కులమతాల ప్రసక్తి లేని మా కొంపలో ఎలా ఉంటుందని.

ఈ విషయంలో మా అత్తగారూ, భర్తా నాకిచ్చిన సహకారం ఎప్పుడూ మరచిపోలేను. ఇబ్రహీం ఇంకా సీనియారిటీని చేరుకోలేదు గనుక ఇప్పట్లో క్వార్టర్సు వచ్చే అవకాశం లేక, వేరే ఇల్లు అద్దెకి తీసుకున్నాం. మా ఊళ్ళో సదుపాయాలు ఉన్న అద్దె ఇళ్ళు బహు తక్కువ. ఇప్పుడు మేం ఉన్నదైనా ఎంతో కష్టపడి సాధించాం. ఇందులో అన్నీ బాగానే ఉన్నాయి గాని ఎటాచ్డ్ బాత్రూం, లెట్రినూ ఉన్న పెద్ద సైజు రూమ్ వీధివైపు ఉన్నది, ఒకటే ఒకటి. వేరే పెరట్లో దూరంగా మరో రేకుల స్నానాల గదీ, సర్వీసు లెట్రినూ లేకపోలేదు. ఇన్నాళ్ళూ వాటిని ఎప్పుడోగాని ఉపయోగించేవాళ్ళం కాదు. దాని మాట అలా ఉంచి మేం అందరం రోజులో ఎక్కువ కాలం గడిపేది ఆ సైడ్ రూమ్‌లోనే. ఈమధ్య మంచి సోఫాసెట్లు తెప్పించి అందులో వేయించాం. మధ్యని తెర కట్టి ఇటువైపు సగం మేం బెడ్‌రూమ్‌గా ఉపయోగిస్తున్నాం. మాకు నిద్ర వచ్చేదాకా మా ఫజల్ చదువుకునేది ఆ ప్రాంతాలలోనే. మా అత్తగారి నమాజూ అక్కడే.

ఇంతకీ వాళ్ళిద్దరూ చెప్పేదేమిటంటే, ఆ గది పూర్తిగా ఖాళీ చేసి, దాన్ని మా అమ్మ కోసం ప్రత్యేకించమని. అనుకోవడమేమిటి నిమిషాలమీద చేసి చూపిస్తే, సోఫాలు ఆఫీసుకి తరలిపోయాయి.



డబుల్ బెడ్ కాట్స్ ఫోల్డ్ అయి అటకెక్కి కూర్చున్నాయి. అత్తగారు ఏర్పరచుకున్న ప్రార్థన మందిరంలోని అల్లా, తత్సంబంధమైన సమస్త సరంజామా ఇలా ఇవతలి వరండాలోకి వచ్చేసి, ఆ స్థానంలో వెంకటేశ్వర స్వామి పూజా మందిరం వెలిసింది. మేం బెడ్స్ వేసుకునే చోట ఓ పక్కగా గాస్ స్టవ్వూ అవీ పెట్టుకుని వండుకోవడానికి చిన్న ప్లాట్‌ఫాం ఎరేంజ్‌మెంటు ఒకటి వెలసింది.

ఇవన్నీ నా మనసులో ఉన్నవే. కానీ, నేను ఊహించని మార్పు కూడా జరిగింది ఆ గదికి. "మనం ఎన్ని ఏర్పాట్లు చేసినా మీ అమ్మగారికి మన కామన్ ఎంట్రెన్స్ నుంచి లోపలికి వచ్చి సైడ్‌రూమ్‌లోకి వెళ్ళడం బాగుండకపోవచ్చు. మనింటి ఓనర్ని ఎలాగో బతిమాలి, అద్దె మరింత పెంచుతానని ఒప్పించి, ఈ పని సాధించాను. ఈ పెద్దగదికి వేరే వీధిలోంచి మెట్లూ అవీ పెట్టించి, గుమ్మం ఎత్తించే ఏర్పాట్లు చేస్తున్నాను. అంతా అయిదు వేలు ఎస్టిమేట్ వేశాను. కానియ్యి. ఎన్నో బాధల్లో ఉన్న ఓ ముసలి ప్రాణికి ఆమెకు తోచిన ధోరణిలో ఆశ్రయం కల్పిస్తే రోజుకి అరడజనుసార్లు నమాజు చేసినట్లు" అని చెబుతున్న ఇబ్రహీం కళ్ళ వెలుగులోకి సూటిగా చూడలేక తలదించుకున్నాను.

ఇక ఆఖర్న చెప్పవలసిందీ, మళ్ళీ మొదటికే వచ్చిందీ. అమ్మని నేను తరలి తెచ్చిన వైనం.

అమ్మ నన్ను చూస్తూనే హోరుహోరున ఎవరో పోయినట్లు ఏడుపు మొదలెట్టింది. దగ్గరగా రావడానికి గాని, చెయ్యేసి ముట్టుకోవడానికి గాని ఒప్పుకోలేదు. ఆ ఇంట్లో నాకు పచ్చి మంచినీళ్ళు పుట్టలేదు. అందరూ తెల్లబోయి చూస్తుంటే అందరికీ సరిపోయేటట్టు అమ్మ నన్ను గుమ్మంలోనే కడిగేసింది. పదిహేనువేల డిమాండ్ డ్రాఫ్ట్ అన్నయ్య పేర తెచ్చానని చెప్పగానే వదిన వరండాలో కర్రకుర్చీ వేసి గాజు గ్లాసులో కాఫీ తెచ్చి నేల మీద పెట్టింది. వీటన్నిటికీ నేను సిద్ధపడే వచ్చాను గనక పట్టించుకోకుండా ఉండాలనే ప్రయత్నం. అన్నయ్యని వీధిలోకి పిలిచి సంగతంతా చెప్పను. "ఎక్కడో బావున్నావని సంతోషించాను గాని ఇంత నాశనం అవుతావనుకోలేదు. నువ్వైతే నీ స్వార్థం చూసుకున్నావుగాని కొడుకుని నా బాధ్యత ఎలా కాదనను! ఏళ్ళ తరబడి ఇంటిల్లిపాదీ మా కంటికి రెప్పలా చూసుకుంటున్నాము. తీరా కూతురి దగ్గర, అందులో తురకాడి ఇంట్లో కన్నుమూస్తే, నేనూ నా ధర్మము ఏం కావాలి! ఆవిడకి ఏమాత్రం ఆఖరిరోజులు దగ్గిర పడినా టాక్సీ చేయించి మళ్ళీ ఇక్కడ దిగబెడతానని ప్రమాణం చేస్తేనే!" అబద్ధం పెళ్ళికి అదేదో వాద్యమని సామెత. హామీలకేం లోటు! అలాగే చేసేశాను. "నేనేదో వంక పెట్టి అమ్మని తీసికెడతాను. అమ్మకి చెప్పకు" అని డీడీ ఉన్న కవరు అక్కడ పెట్టేను. చేతిగాజులు తీసి వదినకివ్వబోయాను. వద్దనలేదు. "స్నానం చేసి వేసుకుంటాను. అలా బల్లమీద పెట్టండి" అంది. కాశీలో ఆంధ్రాశ్రమం అనేది ఉందని పేపర్లో చదివాననీ, చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం కోసం అక్కడికి బయల్దేరుతున్నాననీ అమ్మతో అబద్ధమాడేను. తనకి ఎప్పట్నుంచో కాశీకి వెళ్ళాలని ఉందని నాకు తెలుసు. "సరే నీతో వస్తాను. నీ సామాన్లు దూరంగా పెట్టు ఎప్పటికైనా తప్పు

"మంచి పని చేద్దామనుకున్నా ఒక్కొక్కప్పుడు కుదరదు. అన్ని పోరాటాల్లోనూ గెలుపే వేడిక్కాదు. మరింత ధైర్యంతో ముందడుగు వెయ్యడమే జీవితం."

తెలుసుకుంటే సంతోషమే. చాలా దూర ప్రయాణం. ఏ పరిస్థితుల్లోనూ నన్ను తగలకూడదు. తెలిసిందా?" అన్నిటికీ ఒప్పుకుని బయల్దేరదీశాను.

"నీ రెండో కూతురు అనుకో' అని సావిత్రత్త చెప్పనే చెప్పింది కదా. అలాగే చిన్నపిల్ల మనస్తత్వం గల అమ్మని ఎలాగో రైలెక్కించాను. అదృష్టవశాత్తూ ఆ ఫస్టుక్లాసు కుపేలో మేం ఎదురెదురుగా కూచున్నా మా పై బెర్త్‌ల్లో ఎవరూ లేరు. ఇక ఎందుకని దార్లో ఒక్కొక్క ముక్కా నేనిలా మా ఇంటికి తీసికెడుతున్నాననీ, వేరే తనకన్నీ ఏర్పాటు చేశాననీ చెప్పబోయాను. ఇంకా పూర్తి అవనేలేదు. అంతటి నికృష్ట స్థితిలో ఉండి అష్టకష్టాలు పడుతున్న అమ్మకి ఇంకా అంత గొంతుక ఎక్కడ మిగిలిందో అంతే, రయ్ మని తారాజువ్వలా నామీదకి లేచింది. చూస్తుండగా ఎంత అసహ్యంగా మారిపోయిందో ఆ మొహం! 'థూ!' అని ఉమ్మేసింది.

"ఆ తురకాడింటికా ఈ పరమ పవిత్రమైన శరీరం మోసుకెడుతున్నావ్? మీ ఊరెళ్ళేలోగా గోదారి బ్రిడ్జి వస్తుంది కదా. అంతకన్నా ఆ బ్రిడ్జి మీంచి గోదార్లోకి తోసెయ్యి... నిప్పు కడిగే ఎలాంటి వంశంలో పుట్టావ్. ఎలాంటి దిక్కుమాలిన పని చేశావ్! నీ ఊసు తలుచుకుంటే ఇటు బతికున్న వాళ్ళకే కాదు, అటు చచ్చిన వాళ్ళకు నీళ్ళ చుక్కలు పుట్టవ్. ఇహమూ పరమూ లేకుండా చేసినా, ఇంటాబయటా తలెత్తుకో లేకుండా చేసినా ఇన్నేళ్ళూ ఓర్చాను. ఇంత తిండి పెట్టినా, ఈడ్చి చావగొట్టినా నా దినం తీర్చడానికి చస్తే నాకింత పిండం పెట్టడానికి విధాయకుడు, నా కొడుక్కి హక్కుంది. ఇన్ని అబద్ధాలాడి ఇంకా సాంకర్యం చెయ్యడానికి నీ కన్నతల్లి చేసిన ద్రోహ మేమిటే పాపిష్టిదానా!

ఈటెల్లాంటి ఆ మాటలు తూటాల్లా చెవి ద్వారా గుండెని బద్దలు కొట్టి కొంతసేపు నన్ను కోమాలో పడేశాయి. ఊహించని అంతటి ఎదురు దెబ్బకి కూడా తట్టుకుని కర్తవ్యం ఆలోచించగలిగినందుకు ఆ తర్వాత నన్ను నేను అభినందించుకున్నాను. తర్వాత వచ్చిన పెద్ద స్టేషన్లో బ్రేక్ జర్నీ చేసి, హోటల్‌లో పుటప్ చేసి, అక్కణ్ణుంచి అన్నయ్యకి ఫోన్జేసి -మళ్ళీ మరో అయిదువేలు చేతిలో పెట్టి - అన్నయ్యతో అమ్మని తిరిగి సాగనంపేసరికి నా తాడు తెగింది.

పాపం ముసిల్ది రాలేదేమోనని ఇబ్రహీం స్టేషన్‌కి టాక్సీ కూడా తెచ్చాడు. ఎలాగో టాక్సీ చేరాక బావురుమని ఏడుస్తూ అతని భుజంమీద వాలి పోయాను. కాస్త సేదతీరింతర్వాత జరిగిందంతా చెప్పాను కళ్ళనీళ్ళ పర్యంతమై. "మంచి పని చేద్దా మనుకున్నా ఒక్కొక్కప్పుడు కుదరదు. అన్ని పోరా టాల్లోనూ గెలుపే చేజిక్కదు. మరింత ధైర్యంతో ముందడుగు వెయ్యడమే జీవితం" అంటూ ఓదార్చాడు.

బావురుమంటున్న పక్క గది చూస్తుంటే ఎక్కళ్ళేని శూన్యమూ చుట్టబెట్టుకున్నట్టు ఉంటుంది. సావిత్రత్త రాసిన కంటే చాలా అన్యాయంగా ఉంది అమ్మ దైన్య పరిస్థితి. మరో ఇద్దరి మంచివాళ్ళ సహా యంతో కూడా ఆవిణ్ణి రక్షించలేకపోయానే అని నా హృదయం ఏడుస్తూ ఉంటుంది. ఏం చెయ్యను!

తెలతెలవారుతోంది. ఆ గది వీధివైపు మెట్లమీద కూచున్నాను. ఒక్కసారి నన్ను నేను నిలదొక్కు కున్నట్టు అనిపించింది. చేయని నేరం కోసం, సాధించలేని ఫలితం కోసం, నేనెందుకు బాధ పడాలో బోధపడలేదు. ఆ తెల్లవారుజామున ఈ చెవిలో పడే నమాజు గాని, ఆ చెవిలో పడే సుప్రభాత శ్లోకంగాని నాకేం చెప్పగలిగినట్టు తోచలేదు. ఏదైనా లోపల్నుంచి రావాలి. నాకు నేను మిగుల్చుకుంటే చాలు. నేనో వ్యక్తిగా నిలబడగలననే ఆత్మవిశ్వాసముంటేనే ముందుకి నడిచి ఎవరికైనా ఏమైనా ఇవ్వగలిగేది.

ఇబ్రహీంని లేపి చెప్పేను. ఆఫీసుకి ఫోన్ చేసి చెప్పు. లీవ్ ఎక్స్టెండ్ చేయక్కర్లేదు. ఇవాళే నేను డ్యూటీలో జాయినవుతున్నాను. ■

# కన్నీరు పెట్టించే కర్షకుల కడగండ్లు

## ఎడారిగా మారుతున్న రాయలసీమపై దృష్టి సారించిన సంకలనం



**పల్లేరు ముళ్ళు**
రచన: శాంతి నారాయణ
ప్రతులకు: శాంతి మంజుల, 6/416-డి, కోవూర్ నగర్, అనంతపురం.
పేజీలు: 177;
వెల: రూ. 50/-

మల్లంపల్లి ధూర్జటి

ఇటు బతకనీకుండా అటు చావనీకుండా చంపుకుతింటూవుండే వానలు ఈ గడ్డమీద రైతుల బతుకులతో ఆడుకుంటున్నాయి. ఆ పక్క ఎక్కడో ఎప్పుడో వరదలొచ్చి వూర్లూర్లు కొట్టక పోతాండాయంట. ఆ నీల్లన్నీ కాలవల గండా ఈ పక్కకు మల్లిస్తే ఈ గడ్డంతా సుబిచ్చంగా వుండదేమప్పా?" అని నారపరెడ్డి పల్లేరుముళ్ళు కథలో ఆవేదన వ్యక్తం చేస్తాడు. ఎక్కడో ఎప్పుడో వరదలు రావడం కాదు, ప్రతియేటా వర్షాకాలంలో దేశంలోని చాలా రాష్ట్రాలలో వరదలు బీభత్సం సృష్టిస్తూనే ఉన్నాయి. నదీ జలాలు వృథాగా సముద్రంలో కలిసిపోతూనే ఉన్నాయి. సరైన నీటి సదుపాయం లేక రాయలసీమ వంటి ప్రాంతాలు క్రమంగా ఎడారులుగా మారిపోతూనే ఉన్నాయి. అయినా అటు కేంద్రంలోని, ఇటు రాష్ట్రంలోని పాలకులలకు చీమ కుట్టినట్లు కూడా అనిపించడం లేదు. ఎందుకంటే, అది వారి సమస్య కాదు. ప్రజల సమస్య. దేశంలోని చాలా ప్రాంతాలలో మాదిరిగానే రాయలసీమలో కూడా వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. కానీ, పాలకుల మాదిరిగానే వర్షాలకు కూడా సీమ అంటే చిన్న చూపు. అవి సాధారణంగా ఇక్కడకు రావు. ఎప్పుడో బుద్ధిపుట్టి నప్పుడు వచ్చి రైతులను ఇలా పలకరించి అలా వెళ్ళి పోతాయి. అప్పుడు అక్కడ రైతుల పరిస్థితి ఏమిటి? మిగిలిన ప్రాంతాలలోని రైతులు కనీసం భూగర్భ జలాలను వినియోగించుకునే అవకాశం ఉంది. రాయల సీమలో వేలాది రూపాయలు ఖర్చుపెట్టి బోరింగ్ సౌకర్యం ఏర్పాటు చేద్దామనుకున్నా నీళ్ళు పడవు. అదృష్టం బాగుండి ఒకవేళ వర్షాలు పడి కొంత పంట చేతి కొచ్చినా అది దళారులు, వడ్డీవ్యాపారులపరం అవుతూ ఉంటుంది. ప్రభుత్వం ఎరువులపై ఇస్తున్నా మని చెబుతున్న సబ్సిడీలు అవి ఎవరికి చెందాలో వారికి (సన్నకారు రైతులకు) చెందడంలేదు. సన్నకారు రైతు తాను సన్నకారు రైతునేనని విలేజ్ అసిస్టెంట్ నుంచి, ఆపై మండల రెవిన్యూ అధికారి నుంచి సర్టిఫికెట్ తీసుకోవలసి ఉంటుంది. ఆ తరువాతనే ఎరువుల గిడ్డంగికి వెళ్ళాలి. రైతు ఇందుకోసం ఒక్కొక్కరి చేతులు తడుపుతూ వచ్చేసరికి సబ్సిడీ తీసుకోవడంకన్నా ఎరువులను బయట కొనుక్కో వడమే లాభదాయకం అనిపిస్తుంది. అసలు అక్కడ స్వయంగా వరి పంట పండిస్తూ కూడా వరి అన్నం తినడాన్ని మహద్భాగ్యంగా భావించే వారు ఇప్పటికీ ఉన్నారు. శాంతి నారాయణ పల్లేరుముళ్ళు కథా సంపుటి రాయలసీమ పరిస్థితులను హృదయాలను ద్రవింపజేసే విధంగా వివరించింది. పల్లేరుముళ్ళను ఇందులో కథగా చేర్చారుగాని, నిజానికి అది ఒక చిన్న సైజు నవల. అమెరికాలోని ఏ తెలుగు సంఘం నుంచో పెద్ద మొత్తంలో పారితోషికం పొందడానికి అన్ని విధాలా అర్హమైనదిది. ఈ సంపుటిలోని మూడు నాలుగు పెద్ద కథల్లో ఇది ఒకటి. తాలుగింజలు, కల్లమయిపాయ, దళారి, మట్టిమనుషులు కథలు కూడా రాయలసీమ రైతుల కడగండ్లను కళ్ళకు కట్టించాయి. ఓ పక్క పేదరికం ఇంతగా తాండవిస్తున్నా కులపరమైన భేషజాలకు మాత్రం రాష్ట్రంలో తక్కువేం లేదు. గ్రామీణ ప్రాంతాలలో దళితులు నేటికీ ఎటువంటి అవమానా లను ఎదుర్కొంటున్నారో జీవనాడులు కథ వివరి స్తుంది. ఈ కథలోని కుళ్ళాయప్ప తమ సమస్యలకు తిరుగుబాటే పరిష్కారమని సూచిస్తాడు. నిర్ణయం కథలో బ్రాహ్మణ యువతి సీతాలక్ష్మి కూడా తన సమస్యకు తిరుగుబాటునే పరిష్కారంగా ఎంచు కుంటుంది. ఆర్థిక సమానత్వం వస్తే అన్ని అసమా నతలూ తొలగిపోతాయనుకోవడం భ్రమేననీ, అగ్ర కుల ఆధిపత్యం, దురహంకారం సమాజంలో పైకెదిగిన దళితులను కూడా అణచివేస్తూ, ఎలా అవమానాల పాలు చేస్తోందో ఉక్కుపాదం కథ వెల్లడిస్తుంది. ఆరోగ్యంగా ఉన్నంతవరకే మనిషి అహంభావాలూ, అందచందాలూనూ. ఆస్పత్రి మరణశయ్యమీద ప్రతి మనిషీ అల్పజీవే. ప్రతివాడూ జీవిత తత్వ విశ్లేషకుడే. పేదవాడు ప్రైవేట్ ఆస్పత్రికే కాదు, ప్రభుత్వాస్పత్రికి వెళ్ళడం కూడా రొంపితో సమానమేనని రొంపి కథ సందేశమిస్తుంది.

> పేరుకు సబ్సిడీనే
> గానీ అంతా నున్నగ
> ఆఫీసర్లే
> ఏరకతింటాండారంట.
> ఆఫీసులుండేది
> ఉద్యోగస్తులు
> సంపాయిచ్చుకుండేకే
> పెద్దయా.
> (పుట: 65)

రాయలసీమ బాంబుల సంస్కృతి పట్ల అక్కడి మహిళల ఆవేదనకు గర్భ స్రావం కథ అద్దం పట్టింది. ఆలోచింపజేసే అనేక అంశా లను స్పృశిస్తూ సాగిన కథ బొమ్మా బొరుసూ. తేనెకన్నా తియ్యనిది తెలుగు భాష అని ఎందుకంటారో ఈ కథల్లోని భాషను, నుడికారాలను, సామెతలను, జాతీయాలను పరిశీలిస్తే తెలుస్తుంది.

ఈ సంపుటిలో చేర్చిన 15 కథల్లో దేనినీ త్రోసిపుచ్చడానికి లేదు. "రాయలసీమ స్థితిగతులపైన ఒక థీసిస్ రాయడానికి కావలసినంత సరంజామాను రచయిత ఈ కథల్లో పొందుపరిచాడనడం సత్యసమ్మతంగా ఉంటుంది. సవ్యసాచిలా ఈయన సామాజిక శాస్త్రజ్ఞుల ఆలోచనకు, భాషా శాస్త్రజ్ఞుల పరిశీలనకు పని కల్పించాడు" అని మధురాంతకం రాజారాం ఈ కథలకు చక్కని ఉల్లాకు వేసి ఇచ్చారు. తెలుగు కథాభిమానుల దగ్గర తప్పనిసరిగా ఉండవలసిన పుస్తకం ఇది. ■